భరోసాతో కోలాహలం

- వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ తొలి విడత సొమ్ము అందజేత
- అన్నదాతల ఆర్థికోన్నతికి ప్రభుత్వ తోడ్పాటు
- ఉయ్యూరులో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహణ
- హాజరైన ఎమ్మెల్యేలు పార్థసారథి, అనిల్‌కుమార్, కలెక్టర్ రాజాబాబు


ఉయ్యూరులో రైతులకు వైఎస్సార్ రైతు భరోసా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యేలు పార్థసారథి, అనిల్‌కుమార్, కలెక్టర్ రాజాబాబు తదితరులు

ఉయ్యూరు(పెనమలూరు): అన్నదాతల ఆర్థికోన్నతికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ జిల్లా స్థాయి పంపిణీ కార్యక్రమం గురువారం ఉయ్యూరులోని కాకర్ల కన్వెన్షన్‌లో జరిగింది. జిల్లాలోని 1,55,004 మంది రైతు కుటుంబాలకు వరుసగా ఐదో ఏడాది మొదటి విడత రైతుభరోసా సాయం కింద రూ.116.25 కోట్లు విడుదల చేశారు. ఉద్యాన, వ్యవసాయ పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద 3,009 మంది రైతులకు రూ.2.86 కోట్లు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జిల్లా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి రైతన్నలకు వెన్నుదన్నుగా నిలిచిందని పేర్కొన్నారు. ఆర్‌బీకేలను అందుబాటులోకి తెచ్చి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చిందన్నారు. ఏటా నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోనే రైతు భరోసా సాయాన్ని జమ చేసి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని వివరించారు. పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా పారదర్శక విధానాన్ని తీసుకొచ్చి ప్రజాసంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. రైతులను ఆదుకునే ప్రభుత్వం తమదని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని భ్రష్టు పట్టించిన ఘనత చంద్రబాబుదని దుయ్యబట్టారు. రైతులకు మేలు చేసే కార్యక్రమాలను వివరించారు. అన్నదాతలు జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. మంచి చేస్తున్న ప్రభుత్వంపై చంద్రబాబు, ఎల్లోమీడియా విషం కక్కుతున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. గతంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట దెబ్బతింటే సంవత్సరాల తరబడి సాయం అందని దారుణ పరిస్థితులు చూశామని గుర్తుచేశారు. జగనన్న ప్రభుత్వంలో పంట నష్టం జరిగిన అదే సీజన్‌లోనే రైతులకు పరిహారం అందించి మనోధైర్యాన్ని నింపేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతన్నల కుటుంబాల్లో సంతోషమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలతో అన్నదాతల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోందని వివరించారు. ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని పండుగలా మార్చిన ప్రభుత్వం తమదన్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయభారతి మాట్లాడుతూ.. అర్హత గల ప్రతి రైతుకూ రైతు భరోసా అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పంట నష్టం వాటిల్లిన క్రమంలో పారదర్శకంగా అంచనాలను తయారు చేసి బాధిత రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేశామని వివరించారు. కార్యక్రమంలో అగ్రిబోర్డు జిల్లా చైర్మన్ రాఘవరావు, ఉయ్యూరు మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, ఎంపీపీ చీలి కల్పన, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ


విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో సుబ్బమ్మకు నగదు ఇస్తున్న వలంటీర్ బాణావత్ మాధవి


పింఛన్ల పంపిణీని పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు


పెద అవుటపల్లిలో పింఛన్ అందజేస్తున్న ఎంపీడీవో, వలంటీర్లు

పెనమలూరు: మండల పరిధిలో పింఛన్ లబ్ధిదారులకు గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. పెనమలూరు మండలంలో ఆరు గ్రామాలలో పింఛన్ లబ్ధిదారులు 5,551 మందికి ప్రభుత్వం రూ. 1,53,46,250 నిధులు కేటాయించగా, తాడిగడప మునిసిపాలిటీలో 12,302 మంది లబ్ధిదారులకు రూ. 3,43,43,750 నిధులు ప్రభుత్వం మంజూరు చేశారు. వేకువజామునే ఆయా సచివాలయాలకు చెందిన సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో సాయంత్రం నాటికి 80 శాతం పింఛన్లు పంపిణీ చేశారు. తాడిగడప మునిసిపాలిటీలో 70 శాతం మేర పింఛన్లు పంపిణీ చేశారు. గంగూరులో వికలాంగురాలికి వెల్ఫేర్ సెక్రెటరీ ప్రేమ్‌సుధాకర్ ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చారు. అదే విధంగా పెనమలూరుకు చెందిన చెరుకు సుబ్బమ్మ (80) కాలు విరిగి విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో కొంత కాలంగా చికిత్స పొందుతుంది. వలంటీర్ బాణావత్ మాధవి విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వృద్ధురాలికి వైఎస్సార్ పింఛన్ కానుక అందజేసింది. గ్రామాలలో వృద్ధులకు, వికలాంగులకు, అనారోగ్యంతో ఉన్న వారికి వలంటీర్లు సకాలంలో పింఛన్లు అందజేయటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

రామవరప్పాడు: వృద్ధాప్య, ఒంటరి మహిళ, దివ్యాంగ పింఛన్లు కలిపి రామవరప్పాడులో 95 శాతం, ఎనికేపాడులో 90, ప్రసాదంపాడులో 94, నిడమానూరులో 81 శాతం పంపిణీ చేశారు. తొలి రోజు అన్నీ గ్రామాలు కలిపి 92 శాతానికి పైగా పంపిణీ పూర్తైంది.

వేకువజాము నుంచే పింఛన్ల పంపిణీ

ఉయ్యూరు: వేకువజాము నుంచే పింఛన్లు పంపిణీ ఉత్సాహంగా సాగింది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛను అందించారు. మునిసిపాలిటీలో గురువారం ఉదయం పింఛన్ల ప్రక్రియ చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు పలు ప్రాంతాల్లో పర్యటించి పింఛన్ల పంపిణీని పరిశీలించారు. 97 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని 11 గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు పర్యవేక్షించారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: మండలంలో 7952 పింఛనర్లు ఉండగా 5123 మందికి పింఛన్ అందజేశామని, 70శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. పెద అవుటపల్లిలో పింఛన్ల పంపిణీని ఎంపీడీవో గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు


తెన్నేరు గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్ బోధిస్తున్న ఉపాధ్యాయిని మల్లిక


ముస్తాబాదలో జరిగిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు

కంకిపాడు: వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా తెన్నేరు శాఖ గ్రంథాలయంలో గురువారం స్పోకెన్ ఇంగ్లిష్, గణితంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయిని మల్లిక విద్యార్థులకు ఆయా పాఠ్యాంశాల్లో మెలకువలు నేర్పారు. శిక్షణ కార్యక్రమాలను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమాలను గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

గన్నవరం రూరల్: విద్యార్థులు, బాలలకు చిన్ననాటి నుంచి నీతి కథలు నేర్పాలని పురుషోత్తపట్నం శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు. సమ్మర్ క్యాంపులో గురువారం స్థానిక లైబ్రరీ అభివృద్ధి కమిటీ సభ్యురాలు అన్నే కనకదుర్గ వితరణగా విద్యార్థులకు నీతి కథలు పుస్తకాలను అందజేయగా, వాటిని విద్యార్థులతో చదివించారు. ముస్తాబాద శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం అవసరం


జంపాన హేమశ్రీని సత్కరిస్తున్న ప్రతినిధులు

కంకిపాడు: ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం అవసరమని వక్తలు పేర్కొన్నారు. ఉప్పలూరు గ్రామానికి చెందిన జంపాన హేమశ్రీ 2023 పదో తరగతి ఫలితాల్లో 580 మార్కులు సాధించి ప్రతిభ చాటడంతో యునైటెడ్ యూత్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. పది ఫలితాల్లో సత్తా చాటిన పలువురు విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు నీల సురేష్, విజయవాడ ప్రతిభ కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు జంపాన సుధాకర్, యూవైడబ్ల్యూఓ రాష్ట్ర కార్యదర్శి జంపాన మధుబాబు, మండల ప్రతినిధులు ఆలపాటి శ్రీకాంత్, కార్యదర్శి అక్షయ్‌రామ్ పాల్గొన్నారు.

సమర్థంగా సంక్షేమ పథకాల అమలు

గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో సమర్థంగా సంక్షేమ పథకాలను అమలుచేశారని ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు, మండల పార్టీ అధ్యక్షులు, కన్వీనర్లు పడమట సురేష్, నీలం ప్రవీణ్‌కుమార్, గుడిసె బాలస్వామి కట్ చేశారు. వారు మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఘనవిజయం సాధించి అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా జనరంజక పాలన సాగించారని చెప్పారు. వైఎస్సార్ సీపీ పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్, పార్టీ నేతలు ఎస్‌కేఎంఎం ఏ కలాం, సర్నాల ఆంజనేయులు, కూరటి అరుణకుమారి, చిమట శ్రీనివాసరావు, లుక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శత కలశ క్షీరాభిషేకం



కోడూరు: భక్తుల హరి నామ స్మరణ మధ్య వెంకన్నకు అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వార్లకు విశేష పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించి తిరువారాధన, హోమాలను నిర్వహించారు. కోడూరుకు చెందిన సింగం పవన్ దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించగా, వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం వైభవంగా జరిపారు. 108 కలశాలకు ప్రత్యేక పూజలు చేసి, వాటిని ఆలయం చుట్టూ ఊరేగించి ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్లను కోడూరులోని ఇమ్మడి రాంబాబు ఇంటికి ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి వంతెన సెంటర్‌లోని ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. కోడూరు, ఇస్మాయిల్‌బేగ్ పేట, యర్రారెడ్డివారిపాలెం గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆదివారం స్వామి వారి మూల మూర్తులను శ్రీరంగనాథుడి అలంకారంలో తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ప్రధాన అర్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

'కబడ్డీ' రంగారావు లేని లోటు తీర్చలేనిది


రంగారావుకు నివాళి అర్పిస్తున్న కబడ్డీ అసోసియేషన్ నాయకులు, క్రీడాకారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: కబడ్డీ క్రీడాకారులను ప్రోత్సహించడానికి కృషి చేసిన మూల్పూరి రంగారావు లేని లోటు క్రీడాలోకానికి తీరనిదని ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రావు, ఏపీ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వీర్ల లంకయ్య అన్నారు. ఏలూరురోడ్డులోని పవన్ పవన ధ్యాన మందిరంలో వ్యాయామోపాధ్యాయుడు, ఏపీ కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి మూల్పూరి రంగారావు సంస్మరణ సభ గురువారం జరిగింది. తొలుత రంగారావు చిత్రపటానికి ఏపీ కబడ్డీ అసోసియేషన్ నాయకులు, కబడ్డీ క్రీడాకారులు, వ్యాయామోపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కబడ్డీ అసోసియేషన్ నాయకులు రామారావు, శివరాం, సుగుణరావు, అంతర్జాతీయ కబడ్డీ కోచ్‌లు పద్మజ బాల, అచ్యుతరావు, అన్నె సీతాకుమారి, సత్యనారాయణ, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి


గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

గన్నవరం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వంతో పాటు ప్రతిఒక్కరూ ముందుకురావాలని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన రాయల్ క్రికెట్ ఎరినా గ్రౌండ్‌ను ఆయన ప్రారంభించారు. పార్థసారథి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్, పుట్‌బాల్ శిక్షణ గ్రౌండ్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. స్థానిక ఔత్సాహిక క్రీడాకారులు ఈ గ్రౌండ్‌ను వినియోగించుకోవాలని కోరారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, ఎంపీపీలు అనగాని రవి, జెడ్పీటీసీలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, బాకీబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, గ్రౌండ్ నిర్వాహకులు కొలుసు సతీష్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

యోగా చికిత్సతో మోకాళ్ల నొప్పులకు చెక్


యోగాశక్తి వైద్యంపై అవగాహన కల్పిస్తున్న నిపుణులు

పెనమలూరు: యోగాశక్తి చికిత్సతో మోకాళ్ల నొప్పుల సమస్య పరిష్కారం చేయవచ్చని యోగశక్తి సాధన సమితి చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ అన్నారు. కానూరు అశోక్‌నగర్ ఇండియన్ ఓం కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాలలో భాగంగా గురువారం మోకాళ్ల నొప్పులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ మోకాళ్ల నెప్పులకు ఉత్తమ వైద్య యోగాశక్తి అని అన్నారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా చికిత్స చేయవచ్చని వివరించారు. చిన్నకర్రతో అరచేతిలో మర్దన రోజూ పది నిమిషాలు చేయటం వలన నాడీ కేంద్రానికి ఒత్తిడి కలిగి మోకాళ్ల నొప్పులు తగ్గుతాయన్నారు. ఈ సందర్భంగా నాడీ కేంద్రం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో థెరపిస్టులు మాచూరి శ్రీరామ్, కొండవీటి సుమల పలువురు పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో కొత్త పైప్‌లైన్


సనత్‌నగర్‌లో కొత్త పైప్‌లైన్ వేస్తున్న మునిసిపాలిటీ సిబ్బంది

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ పరిధి కానూరు సనత్‌నగర్‌లో కొత్త పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. సనత్‌నగర్‌లో చాలా సంవత్సరాల క్రితం పైప్‌లైన్ వేశారు. ఈ పైప్‌లైన్‌లు దెబ్బతినటంతో కుళాయిల్లో రంగుమారిన నీరు వస్తోంది. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సనత్‌నగర్ ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించిన సమయంలో స్థానికులు పైప్‌లైన్ సమస్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. దీంతో ఎమ్మెల్యే ఇచ్చిన ఆదేశాలతో తాడిగడప మునిసిపాలిటీ అధికారులు వెంటనే స్పందించారు. సనత్‌నగర్ ప్రాంతంలో దెబ్బతిన్న పైప్‌లైన్ ప్రాంతంలో కొత్తగా గురువారం నుంచి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చాంద్‌బాషా మాట్లాడుతూ సనత్‌నగర్ ప్రాంతంలో పైప్‌లైన్ సమస్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగానే వెంటనే చర్యలు చేపట్టారన్నారు. కొత్త పైప్‌లైన్ నిర్మాణంతో స్థానికులకు తాగునీరు సమస్య పరిష్కారమయిందన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం


కంకిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కంకిపాడు: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని జిల్లా మలేరియా అధికారి రామారావు అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా ఉప్పలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కంకిపాడు పట్టణంలో ఆరోగ్య అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ప్రధాన వీధుల్లో వైద్య సిబ్బంది ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి రామారావు మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ విషయంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. దోమల నిర్మూలన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నిఖిత, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణకుమారి, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్‌కుమార్, సీహెచ్‌ఓ శివదుర్గ, ఏఎన్‌ఎం మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న డాక్టర్ నాగేశ్వరరావు, బాబూరావు, డాక్టర్ రంగారావు

గన్నవరం రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని, రోగుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు తెలిపారు. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీసాక్స్) ఆధ్వర్యాన రాష్ట్రంలోని బ్లడ్ సెంటర్‌లలో పని చేస్తున్న 43 ప్రభుత్వ సెంటర్‌ల స్టాఫ్ నర్సులకు మూడు రోజుల పాటు జరిగే బ్లడ్ ట్రాన్స్ ఫ్యూజన్ సర్వీసెస్‌పై గురువారం అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ఏపీసాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ జె.నివాస్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సదస్సులో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జాస్మిన్ సుల్తానా మొదటి రోజు స్టాఫ్ నర్సులకు బ్లడ్ డొనేషన్ సెంటర్‌లలో తీసుకోవాల్సిన చర్యలపై మార్గ నిర్దేశం చేశారు. దాతలకు కౌన్సెలింగ్ ఇవ్వటం, బ్లడ్ దానం చేసేటప్పుడు వారితో ప్రవర్తించే వాతావరణం, దాతలను బ్లడ్ ఇవ్వడానికి ప్రోత్సహించటం తదితర అంశాలను చర్చించారు. డొనేషన్ అనంతరం దాతలకు వివరించే జాగ్రత్తలు సదస్సులో వివరించారు. దాతలలో మరింత చైతన్యం తెచ్చేందుకు, ప్రజల్లో ఉన్న భయాలను తొలగించేందుకు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ గైడ్ లైన్స్‌ను ప్రచారం చేయాలని, తద్వారా ఏపీ సాక్స్ లక్ష్యాలను నెరవేర్చాలని సూచించారు. ఏపీసాక్స్ ఆధ్వర్యంలో కళాశాల పాథాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ డిపార్టుమెంట్‌లు సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు, డిపార్టుమెంట్ ఆఫ్ పాథాలజీ హెచ్‌వోడీ ప్రొఫెసర్ డి.నవీన్ చంద్రరావు, ప్రొఫెసర్ వి.కళ్యాణ చక్రవర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రణీత్, బ్లడ్ ట్రాన్స్ ఫ్యూజన్ సర్వీసెస్ అసిస్టెంట్ డైరెక్టర్ వి.బాబూరావు, స్టాఫ్ జి.రజిని కుమారి, ఎస్.అశోక చక్ర వర్తి పాల్గొన్నారు.

12న అప్రెంటీస్ మేళా

గుడివాడటౌన్: ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు ఈనెల 12వ తేదీన ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు బీకేఆర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.హరిధర్మేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పూర్తి చేసి అప్రెంటీస్ కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. పూర్తి వివరాలకు 93943 32229, 81436 53907ను సంప్రదించవలసిందిగా కోరారు.

క్లుప్తంగా

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం



పెనమలూరు: పోరంకిలో వేంచేసి ఉన్న పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీవారి తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ చేసిన అనంతరం స్వామివార్లకు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం తిరుప్పావడ సేవ, బాలభోగం నివేదిక, అష్టదళ పాదపద్మారాధన సేవ, శ్రీ వారి రాయబారోత్సవం, సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ చేశారు. రాత్రి 7 గంటలకు పరమ హంస పరివ్రాజకులు త్రిదిండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో శ్రీవారి తిరుక్కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు.. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు. కాగా శుక్రవారం పలు పూజా కార్యక్రమాలు అనంతరం ఉదయం 11 గంటలకు భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తారు.

'భరోసా' విడుదల

పెనమలూరు: మండలంలోని రైతులకు ప్రభుత్వం రైతుభరోసా కింద నిధులు మంజూరు చేసి విడుదల చేసిందని మండల వ్యవసాయాధికారి కనకమేడల శైలజ అన్నారు. ఆమె గురువారం వివరాలు తెలుపుతూ మండల పరిధిలో 2121 మంది రైతులకు ప్రభుత్వం రైతు భరోసా కింద రూ. 1,16,65,500 సొమ్ము మంజూరు చేసి నిధులు విడుదల చేసిందన్నారు. రైతుల బ్యాంకు ఖాతాల్లో సొమ్ము నేరుగా జమ చేస్తామని తెలిపారు. గ్రామాల వారీగా రైతుభరోసా మంజూరైన రైతుల వివరాలు ఇలా ఉన్నాయి. చోడవరం 427 మంది, గంగూరు 175, గోసాల 104, కానూరు 38, పెదపులిపాక 156, పెనమలూరులో 236, పోరంకిలో 387, తాడిగడపలో 212, వణుకూరులో 285, యనమలకుదురులో 101 మంది రైతులకు లబ్ధి చేకూరింది.

పెరిగిన భూముల విలువ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో నగరంలోని ఆరు డివిజన్లు, రూరల్ ప్రాంతంలోని ఏడు గ్రామాల్లో భూముల విలువ గురువారం నుంచి పెరిగిందని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సీహెచ్ రజిత తెలిపారు. నగరంలోని రిజిస్ట్రార్ వార్డులైన 7, 9, 11, 13, 14, 24 (నగరంలో 32 వార్డులు ఉన్న సమయంలో) వార్డులతో పాటు గూడూరు, చిట్టిగూడూరు, కోకనారాయణపాలెం, రామరాజుపాలెం, తరకటూరు, మల్లవోలు, రాయవరం గ్రామాల్లోని భూముల విలువ పెరిగిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఈ ప్రాంతాల్లోని భూముల విలువ 30 శాతం పెరిగిందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో పెరిగిన విలువకు కక్షిదారులు స్టాంప్‌డ్యూటీ 7.5 శాతం చెల్లించాలన్నారు. గత రెండు రోజుల క్రితం సర్వర్ ఇబ్బందులు తలెత్తినా మే 31వ తేదీన సర్వర్ సక్రమంగా పనిచేయడంతో ఒకే రోజు 170 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేశామని వివరించారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహకాలు



గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలం తమిరిశ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన 1997–98 బ్యాచ్ పూర్వ విద్యార్థులు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన కె.శిరీషకు రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన ఎస్.అనుకు రూ.3 వేలు, తృతీయ స్థానం సాధించిన అత్తిలి షైని కి రూ.2 వేలు నగదు బహుమతులు అందించారు. ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాయిబాబు, సాయిరామ్, నాగేశ్వరరావు, రమేష్, పిచ్చేశ్వరరావు,శాంతరాజు,కిషోర్‌తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ టీచర్లుగా సంబోధించండి

కై కలూరు: పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఆర్ట్, వర్క్, హెల్త్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పార్ట్‌టైమ్ కాంట్రాక్ట్ ఇన్‌స్ట్రక్టర్లను పార్ట్‌టైమ్ అని పిలవకుండా ఒకేషనల్ టీచర్లుగా సంబోధించాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్‌ఎస్ దేవేంద్రరావు కోరారు. ఏలూరు జిల్లాలో విలీనమైన కై కలూరు, నూజివీడు నియోజకవర్గాల ఇన్‌స్ట్రక్టర్లతో ఆటపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సాధారణ జీతభత్యం కింద రూ.32,670 చెల్లించాలన్నారు. పాఠశాలల్లో పని చేస్తున్న సిబ్బందికి అభ్యర్థన, పరస్పర, భార్యా భర్తల బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. ఏలూరు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా జీఎస్‌సీ బోస్, ఉపాధ్యక్షుడిగా జీఎన్ బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం.చంటమ్మ, కోశాధికారిగా బి.రాజ్యలక్ష్మి ఎన్నికయ్యారు.